క్లుప్తంగా

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



జక్రాన్‌పల్లి: మండలంలోని కేశ్‌పల్లిలో గురువారం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునంద సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సులోచన, పుష్ప, అనసూయ, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

న్యాల్‌కల్‌లో..

మోపాల్: మండలంలోని న్యాల్‌కల్‌లో తల్లిపాల వారోత్సవాల ముగింపు సందర్భంగా గర్భిణికి సీడీపీవో సౌందర్య సీమంతం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది ఉన్నారు.

కుక్కకాటుపై అవగాహన



సిరికొండ : మండలంలోని తాటిపల్లిలో వైద్య శాఖ ఆధ్వర్యంలో కుక్క కాటుపై గ్రామస్తులకు గురువారం అవగాహన కల్పించారు. గ్రామంలో ఒక దూడను కుక్క కరవగా ఆ దూడ గేదె పాలు తాగింది, ఆ గేదె పాలను గ్రామస్తులు కొందరు తాగారు దీంతో గ్రామస్తులు అనుమానం నివృత్తి కోసం వైద్య ఆరోగ్య శాఖ అధికారులను సంప్రదించారు. మండల వైద్యాధికారి అరవింద్ మాట్లాడుతూ.. గేదె పాలు తాగిన వారు ఏఆర్వీ టీకా తీసుకోవాలని సూచించారు. టీకా తీసుకుంటే ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవని వివరించారు. ప్రోగ్రాం అధికారి వెంకటి, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

తెయూ(డిచ్‌పల్లి): తెయూ భిక్కనూర్ సౌత్ క్యాంపస్‌లో ఏడాది నుంచి రిపేర్‌లో ఉన్న అంబులెన్స్‌ను బాగు చేయించకపోవడంతోనే విద్యార్థిని మృతి చెందిందని వర్సిటీ ఏఐఎస్ఎఫ్ కన్వీనర్ సంజయ్ అన్నారు. గురువారం తెయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని కుటుంబానికి సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చందు, మోక్షిత్, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థినుల ఎంపిక



సిరికొండ: బాసరలోని ట్రిపుల్ ఐటీకి క్రీడా కోటాలో తూంపల్లి జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికైనట్లు పీడీ నగేశ్ గురువారం తెలిపారు. విద్యార్థినులను పాఠశాలలో ఎంఈవో రాములు, ఇన్‌చార్జి హెచ్ఎం మనోహర్ ఉపాధ్యాయులు సన్మానించి అభినందించారు. వారి ఎంపికపై జిల్లా హకీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గంగారెడ్డి, రమణ, వీడీసీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



నిజామాబాద్‌అర్బన్: ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు సుమన్ అన్నారు. గురువారం సంఘం కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలన్నారు. ఉద్యోగుల సమస్యల అంశాలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కరించాలన్నారు. ఈ నెల 15 లోపు పరిష్కరించుకుంటే రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు ఆందోళనలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సమావేశంలో టీఎన్జీవోస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యుడు సతీశ్, కోశాధికారి దినేశ్ బాబు, ముఖ్య సలహాదారులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	101,100	వెండి(కిలో)	1,21,000
22 క్యారెట్స్	93,332	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	160
		లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	32	60	గాజరుగడ్డ	30	60
బెండకాయ	30	60	పచ్చిమిర్చి	50	90
బీరకాయ	20	40	దోసకాయ	20	40
దొండకాయ	30	60	ఆలుగడ్డ	20	40
బీర్నీసుకాయ	50	100	గోబిగడ్డ	15	30
కాకరకాయ	30	60	గోబిపువ్వు	25	50
వంకాయ	30	60	బీట్‌రూట్	30	60
పాలకూర	20	40	కరివేపాకు	40	80
మెంతికూర	40	80	చామగడ్డ	40	80
కొత్తిమీర	20	40	చిక్కుడుకాయ	30	60
పుదీనా	30	60	గోరుచిక్కుడు	40	80
క్యాప్సికం	50	90			

-సుభాష్‌నగర్

వరుణుడిని ఎదిరిస్తూ విధులు

- ఉరుములు, మెరుపులను లెక్క చేయని కార్మికులు
- వర్షంలోనే విధులు నిర్వర్తించిన శ్రామికులు
- పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం పట్టని అధికారులు



పెద్దబజార్ వద్ద డ్రెయినేజీని శుభ్రంచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

నిజామాబాద్ సిటీ : పారిశుద్ధ్య కార్మికులు.. ఒక్కరోజు వారు విధులకు రాకుంటే నగరమంతా దుర్గంధమే. రోడ్లు, డ్రెయినేజీ, చెత్తాచెదారం తరలించకపోతే అపరిశుభ్రత నెలకొంటుంది. ప్రజలంతా ఆరోగ్యంగా ఉండేందుకు కృషి చేస్తున్న శ్రామికుల సంక్షేమాన్ని అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. గురువారం ఉదయం రెండు గంటలపాటు కురిసిన వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వర్తించారు. జనజీవనానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భారీ వర్షంలోనూ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా నగరాన్ని శుభ్రం చేసే పనిలో నిమగ్నమవ్వడం విశేషం.

వెయ్యికిపైగా కార్మికులు

నగర జనాభా 4.30 లక్షలు. ప్రతీరోజు 100 మెట్రిక్ టన్నుల చెత్త తయారవుతోంది. ఇంటింటికీ వెళ్లి కార్మికులు చెత్త సేకరిస్తున్నారు. వీరితోపాటు రోడ్లు, మోరీలు శుభ్రం చేయడం, చెత్త పాయింట్ల వద్ద చెత్తను తొలగించడం వంటి పనులను 1130 మంది కార్మికులు చేస్తున్నారు. కార్మికులు చేస్తున్న పనులను 60 మంది జవాన్లు, ఆరుగురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు, ఇన్‌చార్జి ఎంహెచ్‌వో రవిబాబు పర్యవేక్షిస్తున్నారు. ఒక్కోసారి నగర కమిషనర్ దిలీప్‌కుమార్ సైతం క్షేత్రస్థాయిలో పనులను పరిశీలిస్తున్నారు.

కార్మికుల సంక్షేమం గాలికి..

బల్దియాలో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమాన్ని అధికారులు పట్టించుకోవడం లేదని నిత్యం ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి. యూనిఫామ్‌లు, మహిళా కార్మికులకు చీరలు, నూనెలు, పాదరక్షలు, రెయిన్‌కోట్‌లు, ఆప్రాన్‌లు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కమిషనర్‌గా పనిచేసిన చిత్రా మిశ్రా హయాంలోనే తమకు మేలు జరిగిందని కార్మికులు గుర్తుచేస్తున్నారు. మరోవైపు పారిశుద్ధ్య పనులు చేసే కార్మికులు తరచూ అనారోగ్యం పాలవుతుంటారు. చర్మ సంబంధ, కంటిచూపు, నరాల సంబంధిత, శ్వాసకోశ వ్యాధుల బారినపడుతుంటారు. వీరికి ప్రతినెలా వైద్య పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా, అదీ సరిగా అమలు కావడం లేదు.

కార్మికుల బాగోగులు పట్టించుకోవాలి

చాలీచాలని వేతనాలతో పనులు చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు అధికారులు పట్టించుకోవడం లేదు. వర్షానికి తడవకుండా జూన్‌లో ఇవ్వాల్సిన రెయిన్ కోట్‌లు ఇప్పటి వరకు అందించలేదు. ఇన్‌చార్జి ఎంహెచ్‌వో నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారు.

– దండి వెంకట్, బీఎల్‌టీయూ నాయకుడు

త్వరలోనే రెయిన్‌కోట్‌లు ఇస్తాం

కార్మికుల సమస్యలను పరిష్కరిస్తున్నాం. వారి కష్టాన్ని రోజూ స్వయంగా చూస్తున్నా. రెయిన్‌కోట్‌ల కోసం ఆర్డర్ ఇచ్చాం. త్వరలోనే వాటిని పంపిణీ చేస్తాం. పారిశుద్ధ్య కార్మికులకు ఎలాంటి సమస్యలున్నా నా దృష్టికి తీసుకురావాలి. నాతో కాకపోతే కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తా.

– రవిబాబు, ఇన్‌చార్జి ఎంహెచ్‌వో



గోల్‌హనుమాన్ వద్ద మోరీల్లోంచి చెత్త తొలగిస్తున్న కార్మికుడు



నెహ్రూపార్కు సమీపంలో..



కసాబ్‌గల్లిలో వర్షంలో చెత్తను తొలగిస్తున్న కార్మికులు

డీసీసీబీ మేనేజర్‌పై ఫిర్యాదు

డిచ్‌పల్లి : మహిళలను లక్షాధికారులను చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు రుణాలు మంజూరు చేస్తోంది. ఈ రుణాలు ఇచ్చే విషయంలో డీసీసీబీ డిచ్‌పల్లి శాఖ మేనేజర్ తీవ్ర జాప్యం చేస్తూ ఎక్కడా లేని నిబంధనలు పెడుతున్నారని మహిళా సంఘాల సభ్యులు ఆరోపిస్తున్నారు. మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డికి మెంట్రాజ్‌పల్లి సొసైటీ చైర్మన్ చింత శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. మెంట్రాజ్‌పల్లి, అమృతాపూర్ గ్రామాలకు చెందిన 126 మహిళా సంఘాల సభ్యులకు నెలరోజుల క్రితం ఒక్కో సంఘానికి రూ. 15లక్షలు రుణాలు మంజూరయ్యాయి. రుణం డబ్బులు సంఘ సభ్యులకు ఇవ్వడానికి ఒక్కో సంఘానికి రూ.లక్ష, ఒక్కో సభ్యురాలికి రూ.3వేలు వారి ఖాతాల్లోనే ఉంచాలని మేనేజర్ షరతు విధించారు. లేదంటే రుణం మంజూరు చేసేది లేదని తేల్చి చెప్పడంతో మహిళా సంఘాల సభ్యులు డీసీసీబీ ఉన్నతాధికారులను సంప్రదించగా అలాంటిదేమీ లేదని వారు స్పష్టం చేశారు. ఎలాంటి షరతులు లేకుండా రుణాలు మంజూరు చేయాలని ఆదేశించినా మేనేజర్ రుణాలు ఇవ్వనని వేధింపులకు గురి చేస్తున్నారని సొసైటీ చైర్మన్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. మేనేజర్‌పై చర్యలు తీసుకుని మహిళా సంఘాల సభ్యులకు సకాలంలో రుణాలు ఇప్పించాలని ఆయన కోరారు.

భవిత పిల్లలకు ఫిజియోథెరపీ శిబిరం



జక్రాన్‌పల్లి : మండల కేంద్రంలోని మండల విద్యా వనరుల కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉచిత ఫిజియోథెరపీ శిబిరాన్ని గురువారం నిర్వహించారు. పిల్లల తల్లిదండ్రులు ఇంటి వద్దనే ఫిజియోథెరపీ చేయించుకునేలా ఫిజియోథెరపిస్ట్ సింధు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, కాంప్లెక్స్ హెచ్ఎం లింగన్న, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రమేశ్, రిసోర్స్ టీచర్ స్వామి, సీఆర్పీ సత్యనారాయణ, నగేశ్, సునంద తదితరులు పాల్గొన్నారు.

శివాజీ బీడీ కార్మికులకు న్యాయం చేయాలి



నిరసన తెలుపుతున్న నాయకులు, కార్మికులు

నిజామాబాద్ సిటీ: శివాజీ బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని టీయూసీఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లాకేంద్రంలోని శివాజీనగర్‌లోని బీడీ కార్యాలయం ఎదుట బీడీ కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. కంపెనీ జనరల్ మేనేజర్ ధర్మేంద్ర గాంధీ, కార్మిక శాఖ సహాయ కమిషనర్ శ్రావణి సమక్షంలో చర్చలు జరిపారు. అనంతరం యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వనమాల కృష్ణ, నరేందర్ మాట్లాడుతూ.. శివాజీ బీడీ కంపెనీ యాజమాన్యం కార్మికులపై వివక్ష చూపుతుందన్నారు. కార్మికులకు సరిపడా పని దినాలను, నాణ్యమైన తునికాకు, పొగాకును ఇవ్వడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దిగివచ్చిన యాజమాన్యం, తక్షణమే పనిదినాలను పెంచుతామని, వీలైనంత త్వరగా పూర్తిస్థాయిలో చర్చలు జరిపి అన్ని డిమాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు డి.రాజేశ్వర్, ఎం.వెంకన్న, ముస్కె సుధాకర్, మల్లేశ్, డి.కిషన్, సాయిరెడ్డి, బి.మురళి, కిరణ్, రవికుమార్, కె.గణేశ్, ఎం.సాయిబాబా, కళావతి, సౌందర్య, లక్ష్మి, గంగామణి, రాధిక పాల్గొన్నారు.

మోసాలకు గురవుతున్న బీసీలు



నిజామాబాద్‌నాగారం : రిజర్వేషన్ల పేరిట కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు బీసీ సామాజిక వర్గాలను మోసం చేస్తున్నాయని బీఎస్పీ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి నీరడి లక్ష్మణ్‌అన్నారు. నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో బీఎస్పీ నిర్వహించిన నిరసన కార్యక్రమాలతోనే నేడు బీసీ రిజర్వేషన్ అమలవుతోందని అన్నారు. నాయకులు పోతె ప్రవీణ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పెద్దలను కలిసిన నాయకులు



వీహెచ్‌తో కాంగ్రెస్ నాయకులు



నిజామాబాద్ సిటీ: జిల్లాకేంద్రానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన బీసీ ధర్నాలో పాల్గొన్నారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్, క్రమశిక్షణా సంఘం సభ్యుడు జీవి రామకృష్ణ, దయాకర్‌గౌడ్, అసద్, సంఘం సాయిలు, సుభాష్, ఆకుల మహేందర్, ఉల్లెంగ నాగరాజు, ధాత్రిక భాస్కర్‌లు ఢిల్లీలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి.హనుమంతరావును మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు విపుల్ గౌడ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు కాంగ్రెస్ పెద్దలను కలిశారు. రాజస్తాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్, సీనియర్ నాయకుడు వి. హనుమంతరావును కలిశారు.

వరలక్ష్మి వ్రతం.. కొనుగోళ్ల సందడి



నిజామాబాద్ రూరల్: వరలక్ష్మి వ్రతం సందర్భంగా కొనుగోలుదారులతో మార్కెట్ సందడిగా మారింది. పూజా పరికరాలు, పండ్లు, పూలు కొనుగోళ్లతో దుకాణాలు కిటకిటలాడాయి. ఇదే అదునుగా భావించిన వ్యాపారులు ధరలను పెంచేశారు. పూజ వస్తువుల కొనుగోళ్లతో కుమార్‌గల్లి, కిసాన్ గంజ్, రైల్వే స్టేషన్ రోడ్డు, పూల మార్కెట్, పెద్ద బజార్, అంగడి బజార్ ప్రాంతాల్లో సందడి నెలకొంది.

పాఠశాలల్లో ఘనంగా రక్షాబంధన్



సిర్‌పూర్‌లో తెలుగు అక్షరాలతో తయారు చేసిన రాఖీలు

మోపాల్: మండలంలోని సిర్‌పూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో అక్షర రక్షాబంధనం కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ప్రత్యేకంగా తెలుగు అక్షరాలతో తయారుచేసిన రాఖీలను ధరింపజేశారు. కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన తెలుగు ఉపాధ్యాయుడు డాక్టర్ కాసర్లను హెచ్ఎం వి సత్యనారాయణ అభినందించారు. గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ఎర్రోళ్ల గంగాధర్, ఉపాధ్యాయులు శ్యామల, మోహన్, గాయత్రి ,అక్బర్ బాషా, వందన, డాక్టర్ హజారే శ్రీనివాస్, లలిత పాల్గొన్నారు.

గుండారంలో..

నిజామాబాద్ రూరల్: మండలంలోని గుండారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో రక్షాబంధన్ కార్యక్రమం చేపట్టారు. విద్యార్థినులు విద్యార్థులు రాఖీలు కట్టారు. కార్యక్రమంలో హెచ్ఎం బి. అమర్‌నాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిరికొండ : మండల కేంద్రంలోని పీఎంశ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల/కళాశాలలో ఎకో క్లబ్ ఆధ్వర్యంలో వృక్షా బంధన్ కార్యక్రమం నిర్వహించారు. రక్షాబంధన్‌ను పురస్కరించుకొని చెట్లకు విద్యార్థులు రాఖీలు కట్టారు. ప్రిన్సిపాల్ గడ్డం రాజేష్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



గుండారం పాఠశాలలో రాఖీ పండుగ సంబురాలు



సిరికొండలో చెట్లకు రాఖీలు కడుతున్న విద్యార్థులు

చేనేత రంగానికి ప్రభుత్వం చేయూతనివ్వాలి



చేనేత కార్మికులతో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా

సుభాష్‌నగర్ : చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిచ్చి ఉపాధి కల్పించాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. గురువారం నగరంలోని సుభాష్‌నగర్‌లో ఉన్న ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రధాన భూమిక పోషించి అహింసా ఉద్యమానికి నాంది పలికింది చేనేత రంగమన్నారు. 1905 ఆగస్టు 7న విదేశీ వస్తువుల బహిష్కరణలో కీలకపాత్ర పోషించిన రోజును జాతీయ చేనేత దినంగా ప్రకటించాలన్న ఎంపీ రాపోలు ఆనంద భాస్కర్ ప్రతిపాదనకు స్పందించి కేంద్ర ప్రభుత్వం 2015లో జాతీయ చేనేత దినోత్సవాన్ని ప్రకటించిందని గుర్తుచేశారు. కేంద్రప్రభుత్వం విశ్వకర్మ యోజన పథకం కింద వృత్తి నైపుణ్య శిక్షణనిచ్చి, రుణాలు అందిస్తూ చేతి వృత్తుల వారిని ఆదుకుంటుందని పేర్కొన్నారు. అగ్గిపెట్టెలో పట్టే పట్టు చీరలు నేసిన ఘనత మన నేతన్నలదని, అలాంటి నేతన్నలు అన్నమో రామచంద్రా అంటూ బతుకు జీవనం కోసం గుజరాత్, మహారాష్ట్రలకు వలసలు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. అనంతరం చేనేత కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మాదాసు స్వామి యాదవ్, గిరిబాబు, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, సత్యపాల్, ప్రసాద్, విజయలక్ష్మి, నాయకులు కిశోర్, నాగరాజు, బొట్టు వెంకటేశ్, పల్నాటి కార్తిక్, వీరేందర్, రవి, లక్ష్మణ్, మారుతి పాల్గొన్నారు.

బల్దియా ఇన్‌చార్జిపై చర్యలు తీసుకోవాలి



ధర్నాలో మాట్లాడుతున్న దండి వెంకట్

నిజామాబాద్ సిటీ : కార్మికులపై అమానుషంగా ప్రవర్తిసున్న మున్సిపల్ ఇన్‌చార్జి ఎంహెచ్‌వోగా విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ కమిషనర్ రవిబాబుపై చర్యలు తీసుకోవాలని బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ డిమాండ్ చేశారు. గురువారం బల్దియా ఆవరణలో బీఎల్‌టీయూ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. కార్మికులతో అధికారులు వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని, చాలీచాలని వేతనాలు ఇస్తూ వారి శ్రమను దోపిడీ చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. కార్మికుల సమస్యలపై మాట్లాడానికి వెళ్తే ఇన్‌చార్జి ఎంహెచ్‌వో రవిబాబు తమపై అనుచితంగా వ్యవహరించారని, గౌరవం లేకుండా, అసభ్యపదజాలం ఉపయోగించారన్నారు. ఆయన వ్యవహారశైలిపై కమిషనర్‌దిలీప్‌కుమార్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఉన్నతాధికారులపై కూడా అసభ్యపదజాలం వాడారని తెలిపారు. కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. నాయకులు సిద్ధిరాములు, సబ్బని లత, మేకల రాజేందర్, వై.అనిల్ కుమార్, గంగా శంకర్, లక్ష్మణ్, నవీన్, కె.వెంకటస్వామి, ప్రవీణ్, రాము, కొమ్ము రాహుల్, ఆర్.మురళి, శ్రీశైలం రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మాడ్యూల్ వారీగా విచారణ చేయాలి



మాట్లాడుతున్న ఆర్డీవో రాజేంద్రకుమార్

సిరికొండ : భూభారతి దరఖాస్తులను మాడ్యుల్ వారీగా విచారణ చేసి ఫైళ్లు రూపొందించాలని ఆర్డీవో రాజేంద్రకుమార్ ఆదేశించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో భూ భారతి దరఖాస్తులపై ఆర్డీవో గురువారం సమీక్ష నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతు పేరు తప్పుగా నమోదవడం, పట్టా మార్పిడి పెండింగ్, డిజిటల్ సంతకం , వారసత్వ పట్టా మార్పిడి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి ఆర్డీవో, కలెక్టర్‌కు ఫైళ్లను పంపాలని ఆదేశించారు. తహసీల్దార్ రవీందర్‌రావు, రెవెన్యు ఇన్‌స్పెక్టర్ గంగరాజం, ఏఆర్ఐ నాగన్న, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



జీపీ కారొబార్ల జేఏసీ కార్యవర్గం



గాండ్ల పట్టణ సంఘం కార్యవర్గం

సుభాష్‌నగర్ : నగరంలోని టీఎన్జీవోస్ భవన్‌లో జీపీ కారొబార్ల జేఏసీ కార్యవర్గాన్ని జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుక మారుతి ఆధ్వర్యంలో గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అంతకుముందు కారొబార్ల జేఏసీ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. అధ్యక్షుడిగా కె రంజిత్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా డి సురేశ్, గౌరవ అధ్యక్షుడిగా జి రాజేశ్వర్, కోశాధికారులుగా ఈ గంగాధర్, ఈ శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా ఎస్‌పీ చిన్నయ్య, ఎస్ సాయన్న, ఏ భోజన్న, ప్రచార కార్యదర్శులుగా మిన్‌కుమార్, డి శ్రావణ్ ఎన్నికయ్యారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులు రంజిత్ గౌడ్, డి సురేశ్ మాట్లాడుతూ.. జిల్లాలో కారొబార్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు.

గాండ్ల పట్టణ సంఘం..

నిజామాబాద్ రూరల్ : నగరంలోని గాండ్ల పట్టణ సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాసోల్లా నాగరాజు, ఉపాధ్యక్షుడిగా అసోల్ల రాజేంద్ర, నామినేటెడ్ వైస్ ప్రెసిడెంట్‌గా కూతురు గోపి, సెక్రెటరీగా కాసొల్లా మోహన్, జాయింట్ సెక్రెటరీగా డీజీ సాయన్న, క్యాషియర్‌గా పి. హనుమాన్లు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను సంఘం సభ్యులు సన్మానించారు.

నియామకం..



నిజామాబాద్‌అర్బన్: బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా కన్వీనర్‌గా రామాగౌడ్ నియమితులయ్యారు. గురువారం జేఏసీ కార్యచరణ కమిటీ ప్రత్యేక సమావేశం నిర్వహించి ఎన్నిక నిర్వహించినట్లు కమిటీ సభ్యుడు మహిపాల్ తెలిపారు. కమిటీ గౌరవ సలహాదారులుగా గంగాధర్ గౌడ్, కన్వీనర్లుగా రాజకుమార్, ప్రేమ్ కుమార్, రాంప్రసాద్ ఎన్నికయ్యారు.

నడిపల్లి ఈవోగా గంగాధర్



డిచ్‌పల్లి: మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ నడిపల్లి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈవో)గా గడ్కోల్ గంగాధర్ గురువారం ఇన్‌చార్జి కార్యదర్శి రాధిక నుంచి బాధ్యతలు స్వీకరించారు. ప్రజా ప్రతినిధులు, సిబ్బంది సహకారంతో నడిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. రుద్రూర్ మండలం నుంచి బదిలీపై నడిపల్లికి వచ్చారు. పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

బీసీ మహాసభలో జిల్లా నాయకులు

నిజామాబాద్‌నాగారం: గోవాలో నిర్వహించిన జాతీయ ఓబీసీ మహాసభలో నిజామాబాద్ జిల్లా బీసీ నాయకులు పాల్గొన్నారు. కేంద్రం బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ కోరారు. కార్యక్రమంలో ఆకుల ప్రసాద్, మాడవేడి వినోద్, నారాయణరెడ్డి పటేల్, దర్శనం దేవేందర్, కొయ్యాడ శంకర్, శ్రీలత, చంద్రకాంత్, బగ్గలి అజయ్, బసవరాజు, పల్లికొండ అన్నయ్య, కోడూరు స్వామి, మహేశ్, నర్సయ్య, నాగరాజ్, గోవర్ధన్, శ్రీనివాస్, జయ, అపర్ణ, బాబు, శేఖర్, గణేశ్, విశాల్ పాల్గొన్నారు.

నులిపురుగులతో పిల్లల్లో రక్తహీనత



డిచ్‌పల్లి: కడుపులో నులిపురుగులతో పిల్లల్లో రక్తహీనత ఏర్పడుతుందని, ఆకలి మందగించి పౌష్టికాహార లోపంతో బాధపడతారని ఇందల్వాయి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ క్రిస్టినా సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా గురువారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో డిచ్‌పల్లి, ఇందల్వాయి మండలాల విద్యాధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో అవగాహన కార్యాక్రమం నిర్వహించారు. నులిపురుగుల వల్ల విద్యార్థుల్లో చదువుపై శ్రద్ధ లోపిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణ అధికారి శంకర్, ఎంఈవోలు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సిరికొండ: మండలంలోని రావుట్ల గ్రామంలో జాతీయ నులి పురుగుల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం గ్రామ పంచాయతీ వద్ద విద్యార్థులు మానవహారంగా ఏర్పడ్డారు. నులి పురుగులపై వైద్య సిబ్బంది గ్రామస్తులకు అవగాహన కల్పించారు.